


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL  ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి  గురువారం  16-06-2022  సంపుటి: 03  సంచిక: 266  పేజీలు: 4  వెల: రూ 3-00


# ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలపై స్పెషల్ ఫోకస్: సీఎం జగన్



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల అభివృద్ధి, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. పరిశ్రమల కోసం కేటాయించిన భూముల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు. అలాగే, పెద్ద ఉత్తున ఉపాధిని కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సకాలంలో వారికి ప్రోత్సాహకాలు అందేలా చూడాలన్నారు. కాగా, దేశంలో ఎవ్వరూ చేయని విధంగా ఎంఎస్ఎఈలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇచ్చిందని అధికారులు.. సీఎం జగన్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇదే ఒరవడి కొనసాగాలన్న సీఎం జగన్ స్పష్టం చేశారు. ప్రతీ ఏటా.. క్రమం తప్పకుండా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని సీఎం జగన్ సూచించారు. పారిశ్రామిక వాడల్లో కాలుష్యాన్ని నివారించే వ్యవస్థలను పరిశీలించాలి. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి తగిన స్థాయిలో ఉన్నాయా? లేవా? చూడాలి. ప్రత్యేక నిధి ద్వారా కాలుష్య నివారణ వ్యవస్థలను పారిశ్రామిక వాడల్లో బలోపేతం చేయాలి. సంబంధిత యూనిట్లకు ప్రభుత్వం నుంచి కొంత సహాయం చేసే రీతిలో విధానాన్ని తీసుకురావాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ క్రమంలో పంప్డ్ స్టోరేజీ పవర్ ద్వారా వాల్యూ అడిషన్ చేస్తున్నామని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా తయారీలపై ఫోకస్ పెట్టినట్టు తెలిపారు. దీనివల్ల గ్రీన్‌ఎనర్జీ రంగంలో చాలా ముందడుగు వేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి కూడా పాలసీలు తయారుచేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

# రాహుల్ ఈడీ విచారణ... కేంద్రం కక్ష సాధించట్లేదన్న విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈడీ విచారణపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... "కర్మ సిద్ధాంతంతో పాటూ చేసిన పాపాలు అనుభవించాల్సిందే" అని అన్నారు. కేంద్రం కక్ష సాధింపు చేయట్లేదని స్పష్టం చేశారు. సుబ్రమణ్య స్వామి వేసిన పిల్‌పైనే విచారణ జరుగుతోందని.. రాజకీయాలు ఆపాదించడం తగదంటూ బీజేపీకి మద్దతుగా విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ మనీ-లాండరింగ్ కేసులో రాహుల్ గాంధీ వరుసగా మూడో రోజు ఈడీ ముందు విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసుకు సంబంధించి రెండు రోజుల్లో దాదాపు 20 గంటల పాటు రాహుల్‌ను ఈడీ ప్రశ్నించిన



విషయం తెలిసిందే. పీఎంఎల్‌ఏ సెక్షన్ 50 కింద రాహుల్ స్టేట్?మెంట్‌ను ఈడీ రికార్డు చేస్తోంది. కాగా... రాహుల్ సమాధానాలపై ఈడీ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు లావాదేవీల గురించి సరైన సమాధానాలు రాహుల్ ఇవ్వడం లేదని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రాహుల్?కు మద్దతుగా ఢిల్లీలో కాంగ్రెస్ నేతల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం దగ్గర 144 సెక్షన్‌ను విధించారు.

# కాకినాడలో కేంద్ర మంత్రి పర్యటన

కాకినాడ సుపరిపాలన, పేదల సంక్షేమం లక్ష్యంగా కొనసాగిన ఎనిమిదేళ్ల కేంద్ర ప్రభుత్వపాలన దేశ సర్వతో వికాసానికి సుస్థిర బాటలు వేసిందని కేంద్ర సమాచార ప్రసార, మత్స్య, పశు సంవర్ధక, పాడి శాఖల సహాయ మంత్రి డాక్టల్ ఎల్ మురుగన్ పేర్కొన్నారు. కాకినాడలో కేంద్ర మంత్రి మురుగన్ కలెక్టరేట్ వివేకానంద హాల్లో వివిధ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అలాగే ఆయా పథ కాల లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా పవర్ పాయిం ట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలన, పథకాలు దేశ ఆర్థిక వ్యవస్థ లో నవశవకానికి నాంది పలికాయన్నారు. పేదరిక నిర్మూలన, సత్వర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు లబ్ధిదారులకు సమగ్రంగా అందేలా అధికారులు చూడాలన్నారు.

# భూమన నేతృత్వంలో పెగాసస్‌పై హౌస్ కమిటీ విచారణ



అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్ ద్వారా మానవ హక్కులను చోరీచేసిందన్న ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు నియమించిన ఏపీ శాసనసభా సంఘం (హౌస్ కమిటీ) బుధవారం అసెంబ్లీలో సమావేశమైంది. హౌస్ కమిటీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సభ్యులు కరణం ధర్మశ్రీ, భాగ్యలక్ష్మి, మొండితోక జగన్మోహన్‌రావు, మద్దాళి గిరిధర్ సమావేశమై ఫోన్ ట్యాపింగ్, నిబంధనలకు విరుద్ధంగా రహస్య పరికరాల కొనుగోలుకు సంబంధించి విచారిస్తున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న హోంశాఖ, ఐటీ శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరి నుంచి వివిధ మార్గాల్లో డేటా చోరికి సంబంధించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెగాసస్ వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ రాష్ట్ర అసెంబ్లీలో అప్పటి ఏపీ (చంద్రబాబు) ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసిందని చెప్పడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో విపక్ష నేతల కదలికలపై నిఘా పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం రహస్య పరికరాలను వినియోగించిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఏపీ అసెంబ్లీ మార్చిలో సభాసంఘం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సమావేశం అనంతరం హౌస్ కమిటీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వ్యక్తుల, పార్టీల సమాచారాన్ని దొంగిలించే ప్రయత్నం చేసింది. సాధికార సర్వే ద్వారా సమాచారం సేకరించి అప్రజాస్వామిక విధానాలు అవలంభించారు. దోషులను ప్రజల ముందు నిలబెడతాం. అప్పట్లో ప్రయివేటు వ్యక్తుల ఫోన్లు టాప్ చేసింది. ఇది శాసన సభ నమ్మింది, కమిటీ కూడా నమ్మింది. ఈరోజు ప్రాథమిక విచారణ మాత్రమే జరిగింది. వచ్చే సమావేశంలో పూర్తి సమాచారం ఇస్తామన్నారు. విచారణకు అప్పటి అధికారులను కూడా పిలుస్తాం. మమతా బెనర్జీ చేసిన ఆరోపణలు కూడా ఒక అంశం. చంద్రబాబు చేసిన నిర్వాకాన్ని ఎత్తి చూపుతాం. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా దీనిపై ఆరోపణలు చేశామని హౌస్ కమిటీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు.

# క్రాప్ ఇన్సూరెన్స్ రైతుల కోసమా?...మీ పార్టీ నేతల కోసమా?: దేవినేని



అమరావతి: జగన్ సర్కార్ తీసుకువచ్చిన క్రాప్ ఇన్సూరెన్స్ పథకంపై మాజీ మంత్రి దేవినేని ఉవపలు వ్యాఖ్యలు చేశారు. ట్వీట్టర్ వేదికగా స్పందిస్తూ... "క్రాప్ ఇన్సూరెన్స్ పథకం రైతుల కోసమా?. మీ పార్టీ నేతల కోసమా?. పంటల భీమా చెల్లింపుల్లో అన్నీ అవకతవకలే. వైసీపీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారం. లక్షల మంది అసలు రైతులకు అందని పరిహారం. రైతులకు దక్కాల్సిన కోట్లాది రూపాయలను మీ నేతలు ధీమాగా కొల్లగొడుతున్నారంటున్న రైతులకు ఏం సమాధానం చెప్తారు? సీఎం జగన్" అంటూ దేవినేని ఉమా ట్వీట్ చేశారు.

# దేశంలో మళ్లీ పెరిగిన కరోనా కేసులు..

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు తగ్గినట్టేతగ్గి మళ్లీ పెరిగాయి. మంగళవారం 6594 కేసులు నమోదవగా, ఇప్పుడు ఆ సంఖ్య 8822కు పెరిగింది. ఇది నిన్నటికంటే 33.7 శాతం అధికం. దీంతో మొత్తం కేసులు 4,32,45,517కు చేరాయి. ఇందులో 4,26,67,088 మంది బాధితులు కోలుకున్నారు. మరో 53,637 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇప్పటివరకు 5,24,792 మంది మరణించారు. కాగా, కొత్తగా 15 మంది కరోనాకు బలవగా, 5718 మంది వైరస్ నుంచి బయటపడ్డారని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో ఉన్నాయి. రాష్ట్రంలో 2956 మందికి పాజిటివ్ రాగా, కేరళలో 1989, ఢిల్లీలో 1118, కర్ణాటకలో 594, హర్యానాలో 430 చొప్పున కేసులు నమోదయ్యాయి. ఇక మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.12 శాతానికి చేరింది. రికవరీ రేటు 98.66 శాతం, మరణాలు 1.21 శాతం, రోజువారీ పాజిటివిటీ 2 శాతంగా ఉన్నాయి. ఇప్పటివరకు 1,95,50,87,271 మందికి కరోనా వ్యాక్సిన్లను పంపిణీ చేశారు.



# అర్హులకు బీమా పరిహారం ఇవ్వాలి: తులసిరెడ్డి

అమరావతి: పంటల భీమా పథకం కింద రాష్ట్రంలోని అనేక మంది రైతులకు పరిహారం అందకపోవడం దురదృష్టకరమని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... 29 లక్షల మంది రైతులు అర్హులు కాగా.. 15.6 లక్షల మందికి మాత్రమే మంజూరు అయ్యిందన్నారు. లక్ష మంది రైతుల ఖాతాల్లో డబ్బు పడలేదని తెలిపారు. అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో రైతులు ధర్నాలు చేశారని, గ్రామ సచివాలయాలకు తాళాలు వేశారని అన్నారు. పులివెందుల పరిధిలో మామిడికి నష్టం.. పరిహారం అందలేదని మండిపడ్డారు. గుంటూరు జిల్లాలో మిర్చికి నష్టం.. పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి అర్హులకు బీమా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోనసీమ, కె.సి.కెనాల్ రైతులు విరామం ప్రకటిస్తే సీఎం జగన్ ప్రతిపక్షాలపై నింద వేస్తున్నారని తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఏపీలో కల్యాణమస్తుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలి : టీటీడీ జేఈవో

తిరుపతి : కల్యాణమస్తు సామూహిక ఉచిత వివాహాల కార్యక్రమాన్ని ఏపీవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ ఆగస్టు 7న సుముహూర్తంలో జరుగనున్న కల్యాణమస్తు కార్యక్రమం కోసం దరఖాస్తు ఫారాన్ని త్వరితగతిన తయారుచేసి ఆయా జిల్లాల యంత్రాంగానికి అందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు తిరుపతిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాల న్నారు. సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ పక్షాన, జిల్లా యంత్రాంగం పక్షాన చేయాల్సిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా యంత్రాంగాలకు లేఖలు రాయాలని తెలిపారు. వారితో సమావేశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం గురించి గ్రామస్థాయి వరకు తెలిసేలా ప్రచారం జరగాలని, ఎక్కువమందికి సమాచారం తెలిపేందుకు వీలుగా ఎస్వీబీసీ, ఇతర ఛానళ్లు, సోషల్ మీడియా, శ్రీవారి సేవకులు, ఇతర వాలంటీర్ల సహకారం తీసుకోవాలని అన్నారు.



# గ్రూప్-1 ఇంటర్వ్యూల నిలుపుదలకు ఏపీ హైకోర్టు నిరాకరణ

అమరావతి: గ్రూప్-1 ఇంటర్వ్యూల నిలుపుదలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15 నుంచి 29 వరకు యధాతథంగా ఇంటర్వ్యూలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు నియమకాలు కూడా జరుపుకోవచ్చు. అయితే నియామకాలు ఈ వ్యాజ్యాల్లో కోర్టు ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయి. పిటిషనర్ల సమాధాన పత్రాలను, మార్కుల వివరాలను సీల్డ్ కవర్లో కోర్టు ముందుంచాలని హైకోర్టు సర్వీస్ కమిషన్‌కి ఆదేశాలు జారీ చేసింది.



# సంపాదకీయం

గురువారం 16-06-2022

## పొంచి ఉన్న మాంద్యం ముప్పు

రానున్న మరి కొద్ది నెలల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం పొంచి ఉందని అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దిగ్గజ వ్యాపార వేత్తల నుంచి మదుపరులు, బ్యాంకర్లతో పాటు ప్రపంచబ్యాంక్ సైతం హెచ్చరించింది. ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి నెమ్మదిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఆ తరువాత కొన్ని దేశాలు తీవ్ర మాంద్యంలో చిక్కుకుంటాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక మాంద్యం నుంచి కొన్ని దేశాలు తప్పించుకోలేవని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే వృద్ధి రేటును సైతం భారీగా కుదించింది. 2022లో అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి 2.9 శాతంగా ఉండవచ్చని వెల్లడించింది.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభంతో ఇంధన, ఆహార ఉత్పత్తుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీని కారణంగా సప్లై చైన్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీంతో సరకుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. మరో పక్క కరోనా కేసులు క్రమంగా మళ్లీ పెరగటం కూడా ఆర్థిక వ్యవస్థలపై మళ్లీ ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా అనేక దేశాల్లో ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయిలకు చేరుకుంది. ఈ కారణంగా అనేక దేశాల సెంట్రల్ బ్యాంకులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించాయి. కీలక వడ్డీ రేట్లను క్రమంగా పెంచుతున్నాయి. భారత రిజర్వు బ్యాంక్ సైతం రెండు నెలల కాలంలో రెపో రేటును ఏకంగా 90 బేసిస్ పాయింట్ల మేర పెంచింది.ఇదే సమయంలో యూఎస్ లో ద్రవ్యోల్బణం 40 సంవత్సరాల గరిష్ఠాలకు చేరుకోవటంతో ఆ ప్రభావం ప్రపంచ దేశాలపైనా పడుతోంది. దీనిని అదుపుచేసే క్రమంలో అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుకు సిద్ధమవుతోంది. ఈ విషయంలో అక్కడి ఆర్థిక వేత్తలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమాంతం రేట్లు పెంచుతూ ఉండే ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతుందని వారు అంటున్నారు. దీని వల్ల డిమాండ్ పడిపోయి ఉత్పత్తి చేసే సంస్థలపై కూడా భారీగా ప్రభావం పడుతుందని అంటున్నారు. ఈ క్రమంలో వారు 2008 ఆర్థిక మాంద్యం నాటి పరిస్థితులను గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చిన్న పాటి మాంద్యం సైతం ప్రపంచ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ప్రపంచ బ్యాంక్ హెచ్చరిస్తోంది. ప్రపంచ దేశాలు ఈ పరిస్థితులను జాగ్రత్తగా అదుపులోకి తెచ్చుకోవాలని వారు అంటున్నారు. రానున్న రోజుల్లో ప్రపంచ దేశాలు స్టాగ్ఫ్లేషన్ పరిస్థితులను చూడాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఇది ద్రవ్యోల్బణం కంటే చాలా ప్రమాదకరమైనదని వారు అంటున్నారు. మరో వైపు ఆహార పదార్థాలు, ముడి చమురు ధరలు పెరగడంతో మే నెలలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 15.88 శాతానికి చేరుకుంది. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం మే నెలలో 15.08 శాతం ఉండగా.. అది గతేడాది మేలో 13.11 శాతంగా నమోదైంది. మే 2022లో అధిక ద్రవ్యోల్బణం రేటు ప్రధానంగా మినరల్ ఆయిల్స్, ముడి పెట్రోలియం ఉ సహజ వాయువు, ఆహార వస్తువులు, లోహాలు, ఆహారేతర వస్తువులు, రసాయనాలు ఉ రసాయన ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు మొదలైన వాటి ధరల పెరుగుదల ప్రధాన కారణంగా ఉందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.గత ఏడాది ఏప్రిల్ నుంచి వరుసగా 14వ నెలలో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో కొనసాగుతోంది. వరుసగా మూడు నెలల పాటు పెరుగుదలను కొనసాగిస్తోంది. కూరగాయలు, గోధుమలు, పండ్లు, బంగాళదుంపల ధరలు గత ఏడాది కాలంతో పోలిస్తే భారీగా పెరగడంతో మే నెలలో ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం 12.34 శాతానికి చేరుకుంది. కూరగాయల ధరల పెరుగుదల రేటు 56.36 శాతం, గోధుమలు 10.55 శాతం ఉండగా.. గుడ్లు, మాంసం, చేపల ధరల్లో పెరుగుదల రేటు 7.78 శాతంగా ఉంది.ఇంధనం, పవర్ బాస్కెట్‌లో ద్రవ్యోల్బణం 40.62 శాతంగా ఉండగా.. తయారీ ఉత్పత్తులు, నూనె గింజల్లో ఇది వరుసగా 10.11 శాతం, 7.08 శాతంగా ఉంది. మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 7.04 శాతంగా ఉంది. ఇది వరుసగా ఐదవ నెలలో రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యోల్బణం లక్ష్యమైన 6 శాతం కంటే ఎక్కువగా నమోదైంది. ఈ క్రమంలో.. మొండిగా అధిక ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు భారత రిజర్వు బ్యాంక్ తన కీలక వడ్డీ రేటును గత నెలలో 40 బేసిస్ పాయింట్లు, ఈ నెలలో 50 బేసిస్ పాయింట్ల మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సెంట్రల్ బ్యాంక్ 2022-23 ద్రవ్యోల్బణం అంచనాను 100 బేసిస్ పాయింట్లు పెంచి 6.7 శాతాని తీసుకెళ్లింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అనేక అంతర్జాతీయ కారణాల వల్ల ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. దీనిని అదుపులోకి తెచ్చేందుకు రానున్న కాలంలో సైతం మరిన్ని రేట్ల పెంపులు ఉంటాయని రిజర్వు బ్యాంక్ ఇప్పటికే.. చెప్పకనే చెప్పింది.

# ఆత్మకూరు అనైక్యతతో టెన్షన్

నెల్లూరు, జూన్ 15,వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తి అయింది. ఈ మూడేళ్ల ఆయన పరిపాలన.. మూడునాళ్ల ముచ్చటగానే సాగిందనే ముచ్చట రాష్ట్ర ప్రజల్లో బలంగా నాటుకోందా? ఈ విషయం సీఎం జగన్‌కి కూడా తెలిసిపోయిందా? అందుకే ఇటీవల పార్టీ నిర్వహించిన వర్క్‌షాప్‌లో.. పలువురు ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వబోమని సీఎం జగన్ క్లియర్ కట్‌గా చెప్పేశారా? ఆ క్రమంలోనే నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల్లో ఏడుగురు మంత్రులతోపాటు ఏడుగురు ఎమ్మెల్యేలను రంగంలోకి దించి.. సదరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వారిని ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగించారా? అంటే సీఎం క్యాంప్ కార్యాలయం తాడేపల్లి ప్యాలెస్ నుంచి మాత్రం అవుననే సమాధానం వస్తోందీ. మేకపాటి ఫ్యామిలీకి నెల్లూరు జిల్లాలోనే మంచి గుడ్ విల్ ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ క్రమంలోనే మేకపాటి రాజమోహన్ రెడ్డిని.. పలుమార్లు లోక్‌సభ సభ్యుడిగా నెల్లూరు ప్రజలు గెలిపించిన సంగతి కూడా తెలిసిందే. అయితే ఆయన కుమారుడు మేకపాటి గౌతమ్ రెడ్డి కూడా తండ్రిలా అంతా సాఫ్ట్ అన్న విషయం కూడా విధితమే. 2014 ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి ఎమ్మెల్యేగా గౌతమ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంటే 2019 ఎన్నికల్లో కూడా ఆయన ఇదే నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. జగన్ కేబినెట్‌లో అత్యంత కీలకమైన పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యేగా ఉన్నా.. మంత్రిగా ఉన్నా.. జగన్ పార్టీ గౌరవ మర్యాదలు ఎక్కడా తగ్గకుండా చూసుకొన్న అతి కొద్ది మంది ఎమ్మెల్యేల్లో మొదటి స్థానంలో గౌతమ్ రెడ్డి ఉంటారనివైసీపీ వర్గీయులు చెప్పుకుంటారు. అలాంటి గౌతమ్ రెడ్డి.. ఆకస్మిక మరణం.. జగన్ పార్టీకి గట్టి దెబ్బేనని.. ఆ పార్టీలో ఓ చర్చ అయితే బలంగా ఉ ందట.వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. గౌతమ్ రెడ్డి చాలా డిగ్నిఫైడ్‌గా ఉండేవారని చెబుతుంటారు. అంతేకాదు.. వైసీపీలో మాజీ మంత్రులు కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్, పేర్నినాని తాజా మంత్రి ఆర్కే రోజాల వ్యవహారశైలికి గౌతమ్ రెడ్డి వ్యవహార శైలికి నక్కకూ నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంటుందనే ఓ చర్చ కూడా పార్టీలో గట్టిగానే సాగుతోంది.అలాంటి మేకపాటి ఫ్యామిలీ నుంచి విక్రమ్ రెడ్డి ఈ ఉప ఎన్నికల బరిలో నిలిస్తే.. ఆయన గెలుపు నల్లేరు మీద నడకే అవుతుందని వైసీపీయే కాక విపక్షాలు కూడా భావిస్తున్నాయి. మరి అలాంటి వేళ.. ఇంత మంది మంత్రులు, ఇంత మంది ఎమ్మెల్యేలను ఈ ఉప ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ ఎందుకు దింపారని వైసీపీ నేతల్లోనే కాదు.. విపక్ష తెలుగుదేశంలోనూ సందేహం వ్యక్తం అవుతోంది. పైగా ప్రధాన విపక్షం పోటీలో లేదు. పోటీలో ఉన్న బీజేపీ ఉనికి జిల్లాలో నామమాత్రమే. అయినా ఆత్మకూరు ఉప ఎన్నిక విజయంపై జగన్ ఎందుకు ఇంత టెన్షన్ పడుతున్నారన్న ప్రశ్నకు

ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని... జగన్ కు బాగానే అర్థమైందని అందుకే.. ఇంతలా.. మంది మార్బలాన్ని ఈ ఉప ఎన్నికకు మోహరించారని పార్టీ వర్గీయులే అంటున్నారు. మరోవైపు మేకపాటి ఫ్యామిలీపై అభిమానం ఉన్నా.. జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటు కాస్తా.. బీజేపీకి పడితే.. ఫలితం తారుమారు అయి.. పొరుగున ఉన్న తెలంగాణలో దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల ఫలితాలు లాంటి సీన్ రిపిట్ అయితే.. పరువు పెన్నానదిలో కలుస్తుందని జగన్ భయపడుతున్నట్లు చెబుతున్నారు. ఇంకోవైపు వైసీపీలో లీడర్ నుంచి కేడర్ వరకు అనైక్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తోందట. ఇది నెల్లూరు జిల్లాలో అయితే ఈ అనైక్యత ముదిరి పాకన పడిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీరిందరినీ ఏక తాటిపైకి తీసుకు వచ్చి.. ఫ్యాన్ పార్టీ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అటు మంత్రులకు, ఇటు ఎమ్మెల్యేలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి టార్గెట్ విధించారని సమాచారం. దీంతో ఇన్ చార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. తమ టాలెంట్ జగన్‌కి చూపించాలని ఉబలాటపడుతున్నారట. మరి ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల చిత్తంలో ఏముందనేది మాత్రం అర్థం కావడం లేదని ఫ్యాన్ పార్టీ నేతల్లో ఓ గుసగుస మొదలైంది.

## ధర్మవరం నియోజకవర్గంపై పరిటాల ఆశలు

అనంతపురం, జూన్ 15, పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఎన్నికల్లో రాప్తాడు నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన శ్రీరామ్ ఈసారి ధర్మవరం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేసే అవకాశాలున్నాయి. ధర్మవరంలోనూ పరిటాల కుటుంబానికి కొంత గ్రిప్ ఉ ండటంతో ఈసారి అక్కడి నుంచి పోటీ చేసి శాసనసభలోకి అడుగు పెట్టాలని శ్రీరామ్ భావిస్తున్నారు. సూరి వెళ్లిపోవడంతో... ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీకి పట్టుంది. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ తరుపున గోనుగుంట్ల సూర్యనారాయణ అలియాస్ వరదాపురం సూరి ధర్మవరం నుంచి గెలిచారు. అయితే 2019లో ఓటమి పాలయిన తర్వాత తనకున్న సమస్యల దృష్ట్యా ఆయన బీజేపీలో చేరారు. దీంతో ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి బాధ్యతలను పరిటాల శ్రీరామ్ కు చంద్రబాబు అప్పగించారు. తొలుత అయిష్టంగానే బాధ్యతలను తీసుకున్న శ్రీరామ్ తర్వాత ధర్మవరం నియోజకవర్గంలో తన పట్టును పెంచుకునే ప్రయత్నం గత కొంతకాలంగా చేస్తున్నారు. తరచూ పర్యటిస్తూ తనకంటూ ప్రత్యేక క్యాడర్ ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం బీజేపీలోనే వరదాపురం సూరి కొనసాగుతున్నారు. కానీ ఎన్నికల నాటికి వరదాపురం సూరి తిరిగి టీడీపీలోకి వస్తారన్న ప్రచారాన్ని ఆయన అనుచరులు చేస్తున్నారు. ఇది పరిటాల వర్గానికి మింగుడుపడటం లేదు. దీంతో వరదాపురం సూరిపై నేరుగా మాటల యుద్ధానికి దిగుతున్నారు. సూరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అక్రమాలను పరిటాల వర్గం తరచూ బయటపెడుతూ ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని ఎప్పటికప్పుడు పరిటాల శ్రీరామ్ పార్టీ అధినాయకత్వానికి తెలియజేస్తున్నారు. చంద్రబాబు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పడంతో పరిటాల శ్రీరామ్ కు తనకు ధర్మవరం టిక్కెట్ గ్యారంటీ అని భావిస్తున్నారు. కానీ లాబీయింగ్ చేసి చివరి క్షణంలోనైనా వరదాపురం సూరి పార్టీలో చేరగలరని, లేకుంటే పొత్తులు కుదిరితే అటువైపు నుంచి సూరి వస్తారని భావించిన పరిటాల శ్రీరామ్ నేరుగా ఆయనపై విమర్శలు చేస్తున్నారు. మొత్తం మీద పరిటాల శ్రీరామ్ ధర్మవరం పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మరి సూరి చివరకు ఎగరేసుకుపోతారా? లేక శ్రీరామ్ కే సీటు దక్కుతుందా? అన్నది చూడాలి. అయితే ఇద్దరి మధ్య విభేదాలు మరోసారి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి అడ్వాంటేజీగా మారే అవకాశాలు లేకపోలేదు

# ఉండవల్లి... ఊసరవెల్లి...?



రాజమండ్రి, జూన్ 15, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కు ఏపీలో బీజేపీ అత్యంత బలమైన పార్టీగా కనిపిస్తోంది. తమకంత బలం ఉందని బీజేపీ వాళ్లే అనుకోవడం లేదు. కానీ ఉండవల్లి అరుణ్ కుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుతో భేటీ కాగానే ఒక్కసారిగా ఏపీలో బీజేపీ విశ్వరూప సందర్శనం జరిగిపోయినట్లు మాట్లాడుతున్నారు. ఆయన ఏం మాట్లాడినా కవర్ చేసే మీడియా ఉండటం, ఆయన ఒక మేధావి అనే భ్రమను ప్రజలలో కల్పించే కొందరు పొలిటీషియన్లు ఉండటం కూడా ఉండవల్లికి కలిసొచ్చి ఏం మాట్లాడినా చెల్లుబాటు అయిపోతుందనుకుంటున్నారు. ఏపీలో బీజేపీ బలం ఏమిటో ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికలు, ఆ ఎన్నికలలో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు గమనిస్తే చాలు ఆ పార్టీ బలం ఎంతన్నది తెలుసుకోవడానికి. ప్రత్యేకించి ఆ పార్టీని భుజాన వేసుకుని.. కేసీఆర్ కు భుజకీర్తులు అద్దడానికి ఉండవల్లి ఎందుకు ప్రయత్నిస్తున్నారన్నది అర్థం చేసుకోలేనంత అమాయకులు కాదు జనం. కేసీఆర్ ఒక్కరు మాత్రమే దేశంలో బీజేపీని దీటుగా ఎదుర్కొనగలిగే నాయకుడని ఏపీ ప్రజలకు చెప్పడానికి ఉండవల్లి తెగ తాపత్రేయపడుతున్నట్లు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలను బట్టి అవగతమౌతున్నది. తెలుగుదేశం అధికారంలో ఉన్న సమయంలో మిత్రపక్షంగా ఉండి కూడా ఆ పార్టీని గట్టిగా ఎదుర్కొన్న విషయం.. రాజకీయ పండితుడైన ఉండవల్లి ఎలా, ఎందుకు మరచిపోయారో ఆయనే చెప్పాలి. అంతకంటే ముందు గుజరాత్ లో అల్లర్ల సమయంలో మోడీని సీఎంగా తొలగించాలన్న డిమాండ్ తో ఎన్డీయే నుంచి తెలుగుదేశం బయటకు వచ్చిన సంగతి ఉండవల్లికి తెలియదా.విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరాతి కి అంకురార్పణ జరిగిన సమయంలో ఉండవల్లి కుల విద్వేషాలను రెచ్చగొట్టే పుస్తకాల ఆవిష్కరణలో యమా బిజీగా ఉన్న సంగతి ఏపీ జనం మరచిపోతారా? మరచిపోగలరా? తన రాజకీయ గురువు వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడికి అనకూలంగా అవసరమైన ప్రతి సందర్భంలోనూ గొంతెత్తే ఉండవల్లి ఇప్పుడు కేసీఆర్ తో భేటీ అనంతరం ఏపీలో బీజేపీ బలాన్ని ఆకాసానికెత్తేస్తూ మాట్లాడిన మాటలు కూడా జగన్ కు ఏదో మేర మేలు చేకూర్చేందుకేనన్నది పరిశీలకుల విశ్లేషణ.

## రోజాకు ఇంట రచ్చ రంబోలా

తిరుపతి, జూన్ 15, వైసీపీలో ఆర్కే రోజా పరిస్థితి నగరి నియోజకవర్గంలో రోజురోజుకూ దిగజారుతుంది. రెండోసారి ఎమ్మెల్యే అయిన తర్వాత రోజాపై వ్యతిరేకత మొదలయింది. ప్రజల్లోనే కాకుండా పార్టీలోనే పెల్లుబుకుతున్న వ్యతిరరేకత రోజా హ్యాట్రిక్ విజయానికి గ్యారంటీ లేదు. ఇప్పుడు రోజా మంత్రి అయ్యారు. దీంతో ఇంకా నగరి నియోజకవర్గంలో ఆమె పట్టుకోల్పోయే అవకాశముందని చెబుతున్నారు. మంత్రి పదవి దక్కకుంటే కొంత సానుభూతి అయినా ఉండేదని, అది కూడా ఇప్పుడు ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.ఆర్కే రోజా పట్టుపట్టి మంత్రి పదవిని దక్కించుకున్నారు. నగరి నియోజకవర్గంలో రెండుసార్లు వరసగా గెలిచిన రోజా హ్యాట్రిక్ విజయం సాధిస్తారని మొన్నటి వరకూ భావించారు. కానీ ప్రభుత్వం, వ్యక్తిగతంగా రోజా పై ఉన్న వ్యతిరేకత



ం ో జు ం ో జు క ా ఎక్కువవుతుంది. రోజాకు సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈసారి రోజా వ్యతిరేక వర్గం ఆమెకు సీటు ఇవ్వవద్దని నేరుగా జగన్ వద్దకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.. రోజా వ్యతిరేకులకు ఇప్పటికే కొన్ని పదవులు దక్కాయి. వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రోజా వ్యతిరేకవర్గం ఆమెకు వ్యతిరేకంగా పనిచేసింది. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కొందరు ముఖ్య నేతలకు పదవులు సంపాదించుకున్నా ఒక ముఖ్యమైన సామాజికవర్గం రోజాకు దూరమయిందంటున్నారు. ఈ నియోజకవర్గంలో తమిళనాడు నుంచి వచ్చి స్థిరపడిన వారు కూడా ఎక్కువగా ఉన్నారు. వారు కూడా సమస్యలతో ఎమ్మెల్యే రోజా పనితీరుపై పెదవి విరుస్తున్నారు. టీడీపీ కూడా.... మరోవైపు టీడీపీ అధినాయకత్వం అక్కడ అభ్యర్థిని మార్చాలని చూస్తుంది. గాలి భానుప్రకాష్ రెడ్డి ఇప్పుడిప్పుడే కొంత యాక్టివ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త నేతకు టిక్కెట్ ఇచ్చే ఛాన్సుందంటున్నారు. అదే జరిగితే రోజాకు కష్టకాలమేనని అంటున్నారు. రోజాకు ఇంటిపోరుతో పాటు ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఆమె హ్యాట్రిక్ విజయానికి అడ్డుకట్టపడుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. జిల్లాలోని వైసీపీ కీలక నేతలు రోజాను ఈసారి ఓడించాలన్న ఉద్దేశ్యంతో ఉ న్నారు. వారి ప్రోద్బలంతోనే టిక్కెట్ ఇవ్వవద్దంటూ జగన్ వద్దకు నేతలను పంపించాలని నిర్ణయించారు.

# బెజవాడలో నాని వర్సెస్ చిన్ని

విజయవాడ, జూన్ 15,కేశినేని నాని కేంద్రంగా బెజవాడ టీడీపీ రాజకీయం మరోసారి వేడెక్కుతోందా? కొత్తగా కేశినేని వర్సెస్ కేశినేని అన్నట్టుగా పరిస్థితి మారిపోయిందా? ఎందుకలా? విజయవాడ తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న చర్చ ఏంటి? ఈ ఎపిసోడ్‌లో మరోవర్గం ఎలాంటి పాత్ర పోషిస్తోంది?బెజవాడ టీడీపీలో అగ్గి రాజుకున్నట్టే కన్పిస్తోంది. నిన్నటి వరకు ఎంపీ కేశినేని నాని వర్సెస్ మిగిలిన లీడర్లు అన్నట్టుగా ఉండేది. కేశినేని నానికి వ్యతిరేకంగా బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, బోండా ఉమ వంటి వారు రాజకీయం చేసేవారు. బెజవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ.. ఆ తర్వాత ఒకట్రొండు సందర్భాల్లోనూ గొడవలు బహిర్గతమైన పరిస్థితి ఉంది. ఆ తర్వాత పరిస్థితులు సద్దుమణిగాయి.. కేశినేని నాని పార్టీ అధినాయకత్వంతో సఖ్యతగా ఉండడం మొదలు పెట్టారు. అయితే బెజవాడ టీడీపీలో సీన్ మళ్లీ మొదటికి వచ్చినట్టు కనిపిస్తోందట. పార్టీ అధిష్ఠానానికి.. కేశినేని నానికి మధ్య గ్యాప్ పెరిగినట్టు చెబుతున్నారు. అయితే ఈసారి కారణం వేరేవరో కాదు.. స్వయంగా కేశినేని నాని తమ్ముడు కేశినేని చిన్ని. ఇప్పటి వరకు బెజవాడ రాజకీయాల్లో చిన్ని అంతగా వినిపించ లేదు. కానీ ఇటీవల కాలంలో పెద్దగానే టీడీపీ చర్చల్లో నలుగుతోంది చిన్ని పేరు.వచ్చే ఎన్నికల్లో కేశినేని నాని కాకుండా.. కేశినేని చిన్ని పోటీకి దిగుతారనే ప్రచారం మొదలైంది. ఇది నానికి మంటపుట్టిస్తోందట. ఆ మధ్య చంద్రబాబును.. లోకేషును చిన్ని కలిసి మాట్లాడారట. ఆ తర్వాత నుంచి బెజవాడ టీడీపీ రాజకీయాల్లో.. కేశినేని వర్సెస్ కేశినేని అన్నట్టుగా సీన్ మారినట్టు చెబుతున్నారు. ఇటీవల కేశినేని చిన్ని ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమానికి నానికి అనుంగు అనుచరులనుకున్న ఒకరిద్దరు వెళ్లారు. అలా వెళ్లిన వారిని కేశినేని నాని తన వద్దకు రానీయడం లేదట. దూరంగా పెట్టేశారట. చిన్ని మాత్రం అన్నతో సంబంధం లేకుండా కార్యక్రమాలు చేపట్టడం పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. .మహానాడు సందర్భంగా కేశినేని చిన్ని వేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా నాని ఫొటో లేదు. పైగా ఒక ప్రమోషనల్ వీడియోను సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ చేస్తోంది చిన్నవర్గం.తనను కాదని.. చిన్నిని టీడీపీ పెద్దలు ఎంకరైజ్ చేస్తున్నారనే ఫీలింగ్‌లో నాని ఉన్నారట. ఈ ప్రచారాన్ని నాని ప్రత్యర్థులు అడ్వాంటేజ్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. టీడీపికి.. కేశినేని నానికి మరింత గ్యాప్ పెంచే ప్రయత్నం చేస్తున్నారట. చీటికీ మాటికీ అధిష్ఠానం మీద అలిగి.. తాను పోటీ చేయబోనని నాని చెబుతుంటే.. ప్రత్యామ్నాయాలు చూసుకోవద్దా..? అందుకే చిన్నిని ఎంకరేజ్ చేస్తున్నారనే ప్రచారం మొదలు పెట్టారట. ఇందులో నిజమెంతో ఏమో.. నాని తీరు మాత్రం ఆ ప్రచారానికి బలం చేకూర్చే విధంగానే ఉందని చెవులు కొరుక్కుంటున్నారు. టీడీపీ కీలకపాత్ర పోషించేవారిలో కొందరు నాని గురించి.. అతని తీరుపైనా ఉన్నవీ లేనివీ చంద్రబాబుకు.. లోకేషుకు నూరిపోస్తున్నట్టు తెలుస్తోంది.అయితే పార్టీ పెద్దలు నానిని దూరం చేసుకోవడం ఇష్టం లేదనే సంకేతాలిస్తూనే ఉన్నారట. కాకపోతే పార్టీ హైకమాండ్‌లో వచ్చిన గ్యాప్‌ను తగ్గించుకోవడానికి కేశినేని నాని చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారట. మరి.. రానున్న రోజుల్లో బెజవాడ టీడీపీ రాజకీయాలు కేశినేని వర్సెస్ కేశినేని అని సాగుతాయో.. లేక మరో మలుపు తీసుకుంటాయో చూడాలి.

## గరుడ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు దర్శనం



తిరుపతి : అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో కోలాహలంగా వాహనసేవ జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనోత్సవం అతి ముఖ్యమైనదని అర్చకులు వెల్లడించారు.వేదాలు, ఆచార్యులు గరుడుడిని వేదస్వరూపుడిగా పేర్కొన్నారని, గరుడుని సేవాదృక్పథం,

మాతృభక్తి, ప్రభుభక్తి, సత్యనిష్ఠ, నిష్కళంకత, ఉపకారగుణం సమాజానికి స్ఫూర్తిదాయకాలని వివరించారు. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శిస్తే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకమని, అందుకే గరుడసేవకు ఎనలేని విశిష్టత ఏర్పడిందన్నారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, కంకణబట్టార్ సూర్యకుమార్ ఆచార్యులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్వేగ్..మాయం

తిరుపతి, జూన్ 15, టీటీడీకి రూ. మూడువందల కోట్ల విరాళంతో చిన్న పిల్లల ఆస్పత్రి కట్టిస్తామని గతంలో ఎంవోయూ చేసుకున్న ఉద్వేగ్ ఇన్‌ఫ్రా కంపెనీ చప్పుడు చేయడం లేదు. ఉదయాస్తమాన సేవ టిక్కెట్లను రూ. కోటి.. కోటిన్నరకు అమ్మి చిన్నపిల్లల ఆస్పత్రిని నిర్మిస్తామని ఇప్పుడు టీటీడీ చెబుతోంది. అసలు ఓ సేవ టిక్కెట్లను అంత పెద్ద మొత్తానికి అమ్మడమే విచిత్రం అనుకుంటే.. ఆ సేవ టిక్కెట్లను పాలక మండలి సభ్యులే అత్యధికంగా కొనుగోలు చేస్తూండటం మరింత వివాదంగా మారింది. ఈ తరుణంలో అసలు పిల్లల ఆస్పత్రిని నిర్మిస్తామని వచ్చిన ఉద్వేగ్ ఇన్‌ఫ్రా ఏమయిందన్న ప్రశ్న అన్ని వర్గాల నుంచి వస్తోంది. ఉద్వేగ్ ఇన్‌ఫ్రా పేరుతో ఓ కంపెనీ యజమానికి తిరుమలకు వచ్చి రూ. మూడు వందల కోట్లతో చిన్న పిల్లల ఆస్పత్రి కట్టేస్తానని.. అది మొత్తం విరాళమేనని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. ఎంవోయూ కూడా చేసుకున్నారు. మామూలుగా విరాళం అయితే?చెక్ తీసుకోవాలి.. లేకపోతే ఆన్ లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి..కానీ ఇక్కడ ఉద్వేగ్ యజమానితో టీటీడీ యాజమాన్యం ఎంవోయూ చేసుకుంది. తర్వాత ఆ ఉద్వేగ్ కంపెనీ సూట్ కేసు కంపెనీ అని తేలింది. వ్యాపారాలు.. కార్యాకలాపాలు ఏమీ లేవని.. ఆ కంపెనీ ఖాతాలో రూ. మూడు వందలు కూడా లేవని వెల్లడయింది. అప్పుడే .. ఆ సూట్ కేస్ కంపెనీలో కొంతమంది తెలుగువాళ్లు డైరక్టర్లుగా ఎంవోయూ చేసుకోవడానికి వారం ముందే చేరారని కూడా స్పష్టమయింది. ఇప్పుడా ఉద్వేగ్ కంపెనీ ఏమయింది ? వెనక్కి వెళ్లిపోయిందా.. టీటీడీనే ఎంవోయూ రద్దు చేసుకుందా ? విరాళం ఎందుకు నిలిపివేశారు..? ఇలాంటి వాటిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# వైసీపీలో టీడీపీ ఫ్యాన్స్

విజయవాడ, జూన్ 15,సీపీలో సీన్ మారుతోంది. చంద్రబాబును పొగిడేవారి సంఖ్య పెరుగుతోంది. ఆత్మకూరు ఉపఎన్నిక ను బేస్ చేసుకుని చంద్రబాబును పొగడటానికి కొంత మంది రెడీ అవుతున్నారు. ఇలాంటి వారిలో తాజాగా కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కూడా చేరారు. జగన్ టిక్కెట్ లేదని తేల్చేసిన ఎమ్మెల్యేల్లో నల్లపురెడ్డి కూడా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆత్మకూరు ఉపఎన్నికల్లో వైసీపీ తరపున ఓ మండలానికి ఇంచార్జ్ ఉన్న ఆయన .. ప్రచారంలో చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు ఓ విధానం అనుకున్నారని.. దానికి కట్టుబడి ఉన్నారన్నారు. నిజానికి ఆత్మకూరుపై వైసీపీ విధానం వేరుగా ఉంది. టీడీపీ పారిపోయిందని విమర్శించడం వైసీపీ విధానం. ఆ ప్రకారం ఎవరో ఒకరు ప్రతి రోజూ ప్రెస్ మీట్లు పెట్టి విమర్శలు చేస్తున్నారు. ఈ విషయం కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డికి తెలియకుండా ఉండదని చెప్పలేం. ఎందుకంటే ఆయన చంద్రబాబుపై దూషణలు చేయడంలో ముందుంటారు. కొడాలి నాని, వంశీ తర్వాత ప్లేస్ ఆయనకే ఉంటుంది. అయినా చంద్రబాబును పొగడటానికి ఆసక్తి చూపించారు. నల్లపురెడ్డి టీడీపీ నేత. టీడీపీ తరపున గెలిచి వైఎస్ ఆకర్ష్‌లో కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత వైసీపీకి మారారు. నల్లపురెడ్డి వ్యాఖ్యలను వెంటనే డిప్యూటీ సీఎం ఖండించారు. నల్లపురెడ్డి ముందే చంద్రబాబు ఏ మాత్రం మేలు చేయలేదని తేల్చేశారు. నిజానికి చంద్రబాబుకు థ్యాంక్స్ చెప్పాలని ఏ ఒక్క వైసీపీ నేత కూడా ఊహించే పరిస్థితి ఉండదు. అలాంటి అలవాటు వైసీపీలో ఉండదు. కానీ నల్లపురెడ్డి చెప్పడమే కాదు.. ఇలాంటి వాళ్లు పెరుగుతున్నారంటే.. ఏదో కొంచెం ఆలోచించాల్సిన విషయమేనన్న చర్చ నెల్లూరు జిల్లాలో జరుగుతోంది.

# అర్థం కాని కోడాలి నాని లెక్క



విజయవాడ, జూన్ 15, (న్యూస్ పల్స్)బీజేపీ నేత పురందేశ్వరిపై మాజీ మంత్రి కొడాలి నాని ఘాటు వ్యాఖ్యలు చేయడం ఏపీ రాజకీయాల్లో కొత్త కలకలానికి కారణం అవుతోంది. గుడివాడలో కేంద్ర నిధులతో నిర్మించాలనుకుంటున్న రెండు ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని పురందేశ్వరి అడ్డుకుంటున్నారని కొడాలి నాని ఆరోపణ. నిజానికి పురందేశ్వరికి గుడివాడ ఫ్లైఓవర్లకు ఎలాంటి సంబంధం లేదు. కనీసం ఆమె గుడివాడ నియోజకవర్గ వ్యవహారాల్లో కూడా వేలు పెట్టలేదు. అంతే కాదు.. కేంద్రంలో కూడా ఎలాంటి పదవిలో లేరు. కేవలం బీజేపీలో కీలక పదవిలో ఉన్నారు. అయితే గుడివాడలో కొంత మంది వ్యాపారుల కోసం ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పురందేశ్వరి అడ్డుకునేందుకు గడ్కరీ అపాయింట్‌మెంట్ తీసుకున్నారని కొడాలి నాని చెబుతున్నారు. పురందేశ్వరి తీసుకున్న అపాయింట్‌మెంట్.. అది ఫ్లైఓవర్ల గురించేనని కొడాలి నానికి ఎవరు చెప్పారో కానీ.. విమర్శలు మాత్రం వ్యూహాత్మకంగా రాజకీయంగా చేస్తున్నారన్న అభిప్రాయం మాత్రం ఎక్కువగా వినిపిస్తోంది. ఎన్టీఆర్ కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవలి కాలంలో వంశీ, నాని వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారు. తాజాగా పురందేశ్వరిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో కలకలం ప్రారంభమయింది. ఇటీవల పలువురు కేంద్రమంత్రులు ఏపీకి వచ్చి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. కేంద్ర పథకాల నిధులకు..ఏపీ ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుంటోందని ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమయంలో వ్యూహాత్మకంగా గుడివాడ నానిని వైసీపీ పెద్దలు రంగంలోకి దింపారని అంటున్నారు. ఇతర నేతలపై విమర్శలు చేస్తే పెద్దగా పట్టించుకోవడం లేదని.. నేరుగా పురందేశ్వరిని గురి పెట్టారని అంటున్నారు. తమపై విమర్శలు చేస్తే.. తమ రియాక్షన్ కూడా అలాగే ఉంటుందని చెప్పడానికి గుడివాడ నాని ద్వారా పురందేశ్వరిని టార్గెట్ చేయించారన్న అభిప్రాయం వినిపిస్తోంది. కొడాలి నాని చెప్పే ఫ్లైఓవర్లను కేంద్రం మంజూరు చేసింది. ఇటీవల నితిన్ గడ్కరీ వచ్చి శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పుడు వాటిని ఆపే ప్రయత్నం చేస్తున్నారని కొడాలి నాని అంటున్నారు.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన భూమి.. నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్న వాదన వినిపిస్తోంది.

# కనిపించని ఏరువాక సందడి

ఏలూరు, జూన్ 15, (న్యూస్ పల్స్)ఏరువాక పున్నమి సమయానికి రుతుపవనాలు బలపడి, వర్షాలు మొదలవుతాయి. దుక్కిదున్ని పొలం పనులను మొదలుపెట్టడానికి ఇది అనువైన సమయం. అంతేకాదు! అందరూ ఒకేసారి పనులు మొదలుపెడితే వ్యవసాయం కూడా క్రమ పద్ధతిలో ఉంటుంది. అందుకోసమే? జ్యేష్ఠమాసంలో వచ్చే పౌర్ణమి రోజున వ్యవసాయ పనులను మొదలు పెడతారు. ఒక రకంగా ఏరువాక వ్యవసాయానికి ఉగాది లాంటిది. కర్షకులకు క్యాలెండర్ ఇది!ఏరువాక అంటేనే దుక్కి మొదలుపెట్టడం అని అర్థం. ఈ ప్రత్యేకమైన రోజును ఓ వేడుకలా నిర్వహిస్తారు రైతులు. ఎద్దులను

శుభ్రం చేసి, వాటిని చక్కగా అలంకరిస్తారు. పొంగలిని నైవేద్యంగా పెడతారు. మరో విశేషం ఏమిటంటే? గ్రామీణ ప్రాంతాల్లో ఈ రోజు ఎడ్ల పందేలు కూడా నిర్వహిస్తారు. ఈ రోజు ఎద్దులతో తొలి దుక్కి దున్నించడంతో పాటు.. ఆ సమయంలో, తాము కూడా కాడి పడతారు రైతులు. తమ కష్టసుఖాలలో తోడుండే మూగజీవుల పట్ల తమ గౌరవాన్ని తెలియచేసే ఆచారమది! అటువంటి ఏరువాక ఈ సారి ఏపీలో అందునా గోదావరి జిల్లాల్లో ఎటువంటి సందడీ లేకుండా సాదాసీదాగా సాగిపోతోంది. జగన్ ప్రభుత్వ వ్యవసాయ విధానాల కారణంగా అన్నదాతకు సాగు బరువుగా మారింది. అందుకు నిరసనగా తూర్పుగోదావరిలో రైతులు క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో ఏరువాక సందడే కనిపించడం లేదు. రైతుల ఉగాది ఉషస్సు లేకుండా గడిచిపోయింది.

# ఉత్తరాంధ్రలో ఉనికి కోసం పాట్లు

విశాఖపట్టణం, జూన్ 15, ముందస్తు ఎన్నికలు రావచ్చన్న భావనలో ఉన్న తెలుగు దేశం పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. అర్బన్ లో ముఖ్యంగా విశాఖ నగరంలో పూర్తి పట్టున్న టీడీపీ ప్రస్తుతం విశాఖ గ్రామీణం తో పాటు ఉత్తరాంధ్ర ను ప్రభావితం చేయగల మాజీ ఎమ్మెల్యేలపై తాజాగా దృష్టి సారించింది. దాదాపు గా అసంతృప్తి గా ఉన్న నేపథ్యంలో వారిని తిరిగి తెచ్చుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయడమే కాకుండా నేతలంతా టీడీపీ వైపు చూస్తున్నారన్న ఒక మెసేజ్ నీ పంపాలన్న ఆలోచనలో ఉంది టీడీపీ. ఉత్తరాంధ్ర లో బలమైన పట్టుకలిగిన టీడీపీకి 2019 ఎన్నికల్లో గట్టి షాకే తగిలింది. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం నుంచి బెండ్యాల అశోక్, విశాఖలో నాలుగు స్థానాలు తప్ప.. ఎక్కడా విజయం దక్కలేదు. విశాఖ రూరల్ స్థానంతో పాటు? విజయనగరాన్ని స్వీప్ చేసిన వైసీపీ? శ్రీకాకుళం లో రెండు తప్ప అన్ని స్థానాలు తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు వైసీపీ దక్కించుకున్నప్పటికీ? చాలా చోట్ల టీడీపీ బలమైన పోటీనే ఇచ్చింది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎన్నికల్లో? 98 డివిజన్లకు గాను, 33 స్థానాలు గెలిచి బలం చూపించుకుంది. అయితే, మునుపటి పట్టు సాధించడమెలా? అన్నదానిపై టీడీపీ అధిష్టానం దృష్టి పెట్టింది. ఇటీవల పార్టీ చేపట్టిన పోరాటాలకు మంచి స్పందన రావడం, చంద్రబాబు రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన కూడా బిగ్ హిట్ కావడంతో? కొత్త ఆశలు పుట్టుకొచ్చాయి.ఉత్తరాంధ్రలో మళ్లీ ఉడుం పట్టు సాధించేందుకు? పెద్ద స్కెచ్చే వేసింది టీడీపీ. రకరకాల కారణాలతో పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యేలపై మొదటగా ఫోకస్ పెట్టింది. మాజీలైనా జనంలో తిరుగుతున్నవారినీ? అంగ, అర్థ బలం కలిగి తిరిగి పోటీ చేయాలన్న లక్ష్యంతో ఉన్నవారినీ?. అలాంటి బలాబలగాలేవీ లేకపోయినా ప్రజల్లో మంచి పేరు, సాను భూతి కలిగిన నేతలను లక్ష్యంగా చేసుకుంది. అలాంటివారితో చర్చలు జరిపి పార్టీలోకి తీసుకొచ్చేలా చూడాలని.. స్థానిక నాయకత్వానికి సూచించింది టీడీపీ హైకమాండ్. ఇప్పుడు చేరినా భవిష్యత్తుల్లో పొత్తుల కారణంగా సీటు దక్కకపోయినా, రాజకీయంగా ఢోకా లేకుండా చసే అంశాలపైనా వారితో టీడీపీ నేతలు చర్చిస్తున్నట్టు సమాచారం.ఎన్నికల వ్యయాన్ని భరించగల మాజీ ఎమ్మెల్యేలకు బంపర్ ఆఫర్ ఇస్తోంది టీడీపీ. వారి సామాజిక వర్గ బలాన్నిపట్టి వారు కోరుకునే సీట్లు ఇవ్వడానికి కూడా సిద్దంగా ఉన్నట్టు సంకేతాలిస్తోంది.

దీంతో మాజీ లు కూడా ఈ ఆఫరేదో బాగుందన్నట్టు స్పందిస్తున్నట్టు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ వ్యతిరేకత, మరోవైపు టీడీపీ ఆఫర్ ఈ రెండూ బేరీజు వేసుకుంటూ.. కొన్నాళ్లాగి తమ నిర్ణయాన్ని చెబుతామంటున్నారట. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేష్, అర్బన్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన రెహ్మాన్, నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన తయినాల విజయకుమార్ .. వంటి నేతలు ఈ లిస్టులో ఉన్నట్టు తెలుస్తోంది. ఆ మాజీలు ఇప్పటికిప్పుడు పాజిటివ్ రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో? అక్కడ కాకపోతే ఇక్కడ అన్నట్టుగా ఆశ చూపుతోంది అధికార వైసీపీ. అయితే, ప్రస్తుత ప్రభుత్వంలో అలాంటి నేతలకు ఎలాంటి పదవులూ లేకపోవడంతోనే టీడీపీ వైపు చూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఉత్తరాంధ్రలో పార్టీకి మళ్లీ వెలుగులు తెచ్చేందుకు.. టీడీపీ చేస్తున్న మాజీలను దువ్వడం అనే ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నట్టు తెలుస్తోంది. తరచూ వారితో టచ్ లో ఉండి.. సరైన సమయంలో అధిష్టానాన్ని జోక్యం చేయించి టీడీపీ లో చేర్పించాలన్న లక్ష్యంతో స్థానిక నేతలు ముందుకెళ్తున్నారట. మరి, ఈ ప్లాన్ ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

# టీడీపీ ప్రభుత్వం వైసీపీ నేతల ఫోన్‌లను ట్యాప్

విజయవాడ, జూన్ 15, టీడీపీ హయాంలో పెగాసస్ సాఫ్ట్‌వేర్ వాడిన అంశంపై వరుసగా రెండోరోజు హౌస్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పెగాసస్‌పై నియమించిన హౌస్ కమిటీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతల సమాచారాన్ని అప్రజాస్వామికంగా తస్కరించిందన్నారు. ఈ అంశంపై నిన్న, ఇవాళ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా చర్చించినట్లు తెలిపారు. తమకు కావాల్సిన సమాచారాన్ని అడిగామని.. వచ్చే సమావేశంలో మరింత లోతుగా అధ్యయనం చేస్తామని పేర్కొన్నారు. జూలై 5న మరోసారి హౌస్ కమిటీ సమావేశమవుతుందని చెప్పారు.పెగాసస్ వ్యవహారంపై మూడు నెలల్లోగా విచారణ పూర్తి చేసి నివేదికను సభ ముందు పెడతామని భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం డేటా చౌర్యం విషయంలో అనేక దొంగ పనులు చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తమ ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని చెప్పామన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పిన అంశాలు కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందని వివరించారు.అప్పటి టీడీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసి ప్రైవేట్ ఏజెన్సీల నుంచి సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసిందని భూమన విమర్శలు చేశారు. వ్యక్తుల వ్యక్తిగత గోప్యత, అప్రజాస్వామికంగా ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం చేశారన్నారు. కమిటీ కేవలం పెగాసస్ అంశానికి మాత్రమే పరిమితం కాదని.. అవసరమైతే అప్పుడు నిఘా విభాగంలో పని చేసిన అధికారులను పిలిపిస్తామని తెలిపారు. దోషులను ప్రజల ముందు నిలబెడతామన్నారు. ఆనాడు టీడీపీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేశారని శాసన సభ నమ్మిందని.. కమిటీ కూడా ఈ అంశాన్ని నమ్ముతోందని భూమన అన్నారు.

# దేవుని పొలం గుంజారు దేవాలయాన్ని గాలికి వదిలేశారు



బ్రాహ్మణ కొట్కూరు,: నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామమునందు శ్రీఆంజనేయ స్వాములవారి ఆలయం కలదు గతంలో ఈ దేవాలయానికి 40 ఎకరాల మన్యం భూమి కలిగి ఉండేది 1981 లో ఉన్న పొలమును అమ్మివేశారు అప్పటి నుంచి నేటి వరకు ఆ దేవాలయాని పట్టించుకునే నాధుడే కరువయ్యారు అలాగే ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు శ్రీరామ్ నారాయణ గారి కుటుంబం కూడా ఆర్థిక లోటుకు గురి అయ్యారు అయినను ఆంజనేయ స్వామి వారి పైన ఉన్న భక్తితో ఎలాంటి ఆదాయం లేకుండా అర్చకత్వాన్ని కొనసాగిస్తున్నారు శ్రీఆంజనేయ స్వామి వారి దేవాలయం పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి దీనివలన ఆలయానికి వచ్చే భక్తులకు ఏమి జరుగుతుందోనని భయభ్రాంతులకు గురి అవుతున్నారు ఇది చాలా పురాతణమైనటి వంటి ఆలయం కానీ ఆలయమును ఎవరు పట్టించుకోకపోవడం విచారకరం ప్రభుత్వం వారు ఎంత త్వరలో ఈ ఆలయం పై దృష్టి సారించి తగిన మరమ్మతులు చేస్తే దేవాలయం గ్రామానికి ఎంతో మేలు జరుగుతుంది ఆ గ్రామస్తులు కూడా ఈ దేవాలయం పై శ్రద్ధ వహించి అభివృద్ధికి పాటుపడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

# సజీవ చిత్రకారుడు మైనంపాటి

**- ఆచార్య కె.కృష్ణారెడ్డి**

కడప జూన్ 15: చారిత్రక ఆధారాలను సుస్పష్టం చేస్తూ సి.పి.బ్రౌన్ ఊహాచిత్రాన్ని గీసి ప్రపంచంలో బ్రౌన్‌ను సజీవంగా నిలిపిన గొప్ప చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బుధవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ ఊహాచిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, సి.పి.బ్రౌన్ కేంద్రం బాధ్యులు డా మూల మల్లికార్జున రెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ చిత్రపటం గానీ, ఛాయాచిత్రం గానీ ఎంత ప్రయత్నించినా లభించలేదని, బ్రౌన్ చిత్రం కొరత ను .బ్రౌన్ స్మారక కేంద్రం వ్యవస్థాపకులు డా జానమద్ది హనుమచ్ఛాస్త్రి తోపాటు తెలుగువాళ్ళందరిని బాధించింద న్నారు 1990లో ఆకాశవాణి కార్యక్రమ సందర్భంలో మిత్రులైన మైనంపాటి తో డా జానమద్ది బ్రౌన్ స్మారక మందిరాన్ని నిర్మించుకుంటున్నాం కానీ ఆ మహానుభావుని చిత్రానికి నోచుకోలేకపోయామని బాధపడ్డారని అన్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం అనే నాలుగు లలితకళల్లో ప్రావీణ్యం ఉండి, లలితకళానిధిగా కొనియాడబడుతున్న మైనంపాటి జానమద్ది ఆవేదనను పోగొట్టడానికి కుంచెపట్టి, భారతి పత్రికలో లభించిన బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ ఛాయాచిత్రం ఆధారంగా సంవత్సరం పాటు శ్రమించి బ్రౌన్ ఊహాచిత్రాన్ని ఆయన కృషిని వెల్లడిచేస్తూ తాళపత్ర గ్రంథ అధ్యయన నేపథ్యంతో చిత్రించారని అన్నారు అనంతరం .బ్రౌన్ కేంద్రం బాధ్యులు డా మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మైనంపాటి కూడా తాళ్ళపాక కవుల కోవలోనే సంగీత సాహిత్యసేవ చేసినట్లు, నాట్యశాస్త్రంలో, చిత్రలేఖనంలో నేర్పరులైనట్లు వాళ్ళ రచనల ద్వారా, రచనా అవశేషాల ద్వారా, శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు అయితే ఆ రచనలకు తగినంత ప్రచారం లేక సాహితీలోకానికి దూరం కావడం బాధాకరమన్నారు మైనంపాటి కూడా తన పూర్వీకుల లాగా లలితకళానిధి అన్నారు ఆయన త్రిలింగభారతి, శ్రీకృష్ణార్పణం, శ్రీపాదరేణువు, జాహ్నవీ ప్రసాదం మొదలైన



ఖండకావ్యాలను, పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవ కావ్య ప్రేరణతో శ్రీకృష్ణతాండవం అనే గేయకావ్యాన్ని, మాతాన్నపూర్ణేశ్వరీ శతకం, నిశ్శంక వృషాంక శతకం వంటి శతకాలను రచించారని అన్నారు. ఇంకా ఆయన 'నన్నయభట్టు', 'అల్లరిపిల్ల'(వరూధిని), 'సుగాలి రాముడు'(మట్లిరాజు) అనే చారిత్రక నవలలను, 'విజయశ్రీ' అనే శివాజీ నాటకాన్ని, 'తాళిబొట్టు'?ట, 'పల్లెసీమ' వంటి నాటికలను, 'అరణ్యరోదన'మనే గేయాన్ని రచించారని చెప్పారు. ఆయన బాలసాహిత్యం కూడా రచించారని గుర్తు చేశారు 'ఆకులు చెప్పిన అరవైనాలుగు కథలు', 'శ్రీమద్రామాయణ కథామాల', 'అక్షరజ్ఞాన దర్పణం', 'తెనాలి రామకృష్ణ' అనే నాలుగు బాలల రచనలను చేశారని, ఇవన్నీ 'బాలమిత్ర' అనే బాలల మాసపత్రికలో ధారావాహికంగా వచ్చాయని అన్నారు. సహాయ పరిశోధకులు డా చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ 1974లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బ్రౌన్ ప్రాజెక్టు ద్వారా ఆచార్య జి.ఎన్.రెడ్డి, బంగోరెల కృషి ఫలితంగా బ్రౌన్‌కు సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు కానీ బ్రౌన్ చిత్రం మాత్రం లభించలేదన్నారు , కడపలో బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణ సమయంలో మైనంపాటి ఊహాచిత్రం ద్వారా ఆ లోటు తీరిందని చెప్పారు మరో సహాయ పరిశోధకులు డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ మైనంపాటి కృషి బహుముఖీనమైందన్నారు లలిత కళలన్నింటిలో ఆరితేరిన ఆయన పద్యం, వచనం, గేయం, నాటకం, నాటిక, కథ, వ్యాసం మొదలైన ప్రక్రియల్లో 35కు పైగా రచనలు చేశారని అన్నారు. కోడూరులో ఆయన పేరిట ఒక సాహిత్య పీఠాన్ని నెలకొల్పి, ప్రతి ఏటా కళాకారులను సత్కరిస్తుండడం ముదావహమని చెప్పారు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

**చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు**

నరసాపురం సంక్షేమ పరిపాలనను ప్రజలకు చేరువ చేశామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు.నరసాపురం పట్టణం 20 వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.ప్రజా సమస్యలను తెలుసుకుంటూ,వారికి అందే సంక్షేమ కార్యక్రమాలను బ్రౌచర్ ఇచ్చి వివరిస్తూ ప్రజలతో మమేకమై విస్తృత పర్యటన చేశారు.తొలుత ముదునూరి కి వార్డులో నాయకులు,కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయం వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రతి కుటుంబానికి తీసుకువెళ్ళి సంక్షేమ పథకాలు ప్రజల గడపకు చేరుస్తున్నామని అన్నారు. ఈ మూడు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాల బ్రోచర్స్ ను ప్రజలకు ఆయన అందజేశారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక విధంగా లబ్ధి పొందుతున్నామని ప్రజలు ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తిని కనబరుస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్, శానిటేషన్, విద్యుత్, నాడు నేడు పాటశాలలు తదితర అంశాలపైన పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, అడ్మినిస్ట్రేషన్ సక్రమంగా జరిగితే అన్ని సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రజలందరికీ సక్రమంగా అందుతాయని ఆయన అన్నారు. అధికారులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని, గృహ నిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడి వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా తమవంతు కృషి చూపించాలని ఆయన అన్నారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలన్నీ సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రజల నుంచి రహదారుల నిర్మాణం, త్రాగు నీరు, డ్రైనేజ్, విద్యుత్, అంగన్వాడి భవనాల నాడు నేడు పాటశాల అభివృద్ధి స్మశాన వాటిక తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన చీఫ్ విప్ అధికారుల సమీక్షలో వాటి పరిష్కారం కోసం పలు సూచనలు సలహాలు ఆయన చేశారు. ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. సచివాలయ వాలంటీర్ల పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తప్పవు అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ జయరాజు,కౌన్సిలర్లు,20వ వార్డు నాయకులు,యూత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ఉప ఎన్నికలలో సామాజిక న్యాయాన్ని గెలిపించాలి

**-బి పి ఎఫ్ అభ్యర్థి బూరగ రత్నం**

ఆత్మకూరు ఈ నెల 23న జరగనున్న ఆత్మకూరు ఉప ఎన్నికలలో సామాజిక న్యాయాన్ని గెలిపించాలని భారతీయ పార్టీల ఫ్రంట్ బలపరిచిన రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అభ్యర్థి బూరగ రత్నం పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు, మర్రిపాడు ,అనంతసాగరం ,అనుమసముద్రంపేట, చేజర్ల , సంగం మండలాలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య రక్షణ సమసమాజ స్థాపన తన లక్ష్యమన్నారు. దోచుకొని దాచుకొని దోపిడీ దొంగలకు ఆత్మకూరు ఎన్నికలలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతు రక్తం పై రాజ్యమేలుతున్న భారతీయ జనతా పార్టీకి ,వైకాపా ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో తగిన శాస్తి చేయాలని సూచించారు. అధికారమనే రాజ్యాధికారానికి అలవాటుపడిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికార పార్టీలైన బిజెపి ,వైకాపా నాయకులు ఎన్నికల నియమ నిబంధనలను పాటించకుండా ఓట్లు కొనుగోలు చేయడంతోపాటు రిగ్గింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఈ విషయాన్ని ఆత్మకూరు ప్రజానీకం గుర్తించాల్సి ఉందన్నారు. వ్యాపార కుటుంబ రాజకీయ వారసులు అవకాశం ఇస్తే ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమం అదో గతి పాలవుతుందని గుర్తు చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆత్మకూరు నియోజకవర్గాన్ని పరిపాలించిన స్వర్గీయ మంత్రి గౌతమ్ రెడ్డి ఏమి అభివృద్ధి సాధించారనే విషయం నెమరు వేసుకొని సామాజిక న్యాయం వైపు దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23 జరగనున్న ఆత్మకూరు ఉప ఎన్నికలలో భారతీయ పార్టీల ఫ్రంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అభ్యర్థికి స్విచ్ బోర్డు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

# పెనుమంచిలిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆచంట ప్రతీ ఇంట్లో ప్రతీ అవసరాన్ని వైకాపా ఎజెండాగా మార్చుకుని పరిపాలన చేస్తున్నామని ఆచంట శాసనసభ్యులు, మాజీమంత్రి, జిల్లా వైకాపా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం 16 వ రోజు కార్యక్రమాల్లో భాగంగా ఆచంట మండలం పెనుమంచిలి గ్రామంలో రెండవరోజు ప్రతీ ఇంటికి తిరిగి వారి అవసరాలు, సమస్యలు గురుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ప్రతీ పేటలోను రహదారులు ఇబ్బందిగా ఉన్నాయని, సుమారు 5 దశబ్దాలనుండి ఇబ్బందులు పడుతున్నామని

శ్రీ రంగనాధరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భముగా పంచాయితీ రోడ్లు తప్పనిసరిగా వేయాలని అధికారులను ఆదేశించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం మూడేళ్ళ పాలనలో ప్రతీ ఇంటికి ప్రతీ మనిషికి మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ నేతృత్వంలో పనిచేస్తున్నామని అన్నారు. ఈ మూడేళ్లలో రాష్ట్రంలో వివిధ పథకాలు కింద రు. 1లక్ష 36 వేల 694 కోట్లు లబ్ధిదారులకు నేరుగా అందాయని తెలిపారు. మూడేళ్ల పరిపాలన లో ఎన్నో చారిత్రాత్మకమైన మార్పులు తీసుకువచ్చామన్నారు. 2019లో చేసిన వాగ్దానాల్లో 95 శాతం వాగ్దానాలు అమలుచేసి, ప్రతీ ఏడాది మేనిఫెస్టోను మీ ఇంటికే నేరుగా అందిస్తున్నామన్నారు. ప్రతీ ఇంటికి, ప్రతీ పేదకు మేలు చేసే విధంగా వైకాపా ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వివరాలు అన్నింటితో 16 పేజీల బుక్ లెట్ ను కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంచిలి గ్రామ సర్పంచ్ గణేశుల శేషవేణి, ఆచంట మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, చిల్లే లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం

శ్రీశైల దేవస్థానం లో ప్రధాన ఆలయ ప్రాంగణములో నిర్మించబడిన ఉపాలయములో బుధవారం రోజు అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ట జరిపించబడింది. ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు త్రయాహ్నిక దీక్షతో మూడు రోజులపాటు అనగా ఈ నెల 13వ తేదీ నుంచి జరిపించబడ్డాయి. బుధవారం రోజు జరిగిన ప్రతిష్టా కార్యక్రమములో స్థానిక శాసనసభ్యులు శిల్పాచక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ ఎస్. లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి. జంగం సుజాతమ్మ. ఎం. విజయలక్ష్మి ఎ. లక్ష్మి సావిత్రమ్మ, మేరాజోత్ హనుమంతనాయక్, ఓ. మధుసూదన్ రెడ్డి, సూరిశెట్టి మాధవీలత, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు దర్మరాజు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు. కాగా ఈ ప్రతిష్ఠలో భాగంగా ముందుగా బుధవారం రోజు ఉదయం గం.6.00ల నుంచి గణపతిపూజ జరిపించబడింది. తరువాత పుణ్యాహవాచనం, ఆవాహిత దేవత అర్చనలు, దేవతాహవనములు జరిపించబడ్డాయి. తరువాత నిర్ణయించబడిన సుముహూర్తంలో గం.7.15ని.లకు యంత్రస్థాపన, శ్రీ అన్నపూర్ణాదేవివారి విగ్రహప్రతిష్ఠ, శిఖరప్రతిష్ఠా, కళాన్యాసము, నేత్రోల్మీనము, సాత్విక బలిహరణలు, పూర్ణాహుతి జరిపించబడ్డాయి. అనంతరం అన్నపూర్ణ అమ్మవారికి పుష్పాలంకరణ, జరిపించబడ్డాయి. కాగా ప్రతిష్టా కార్యక్రమములో భాగంగా గత రెండు రోజులలో అనగా ఈ నెల 13,14 తేదీలలో పారాయణలు, మూలమంత్ర జపాలు, ఆవాహిత దేవతార్చనలు, హవనములు, అన్నపూర్ణాదేవి విగ్రహానికి జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యానివాసం తదితర కార్యక్రమాలు జరిపించబడ్డాయి.

# త్వరలో అందుబాటులోకి 5జీ సేవలు

## స్పెక్ట్రం వేలానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర




న్యూఢిల్లీ : భారత్‌లో 5జీ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం 5జీ స్పెక్ట్రం వేలానికి టెలికాం శాఖకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రజలు, వాణిజ్య సంస్థలకు 5జీ సేవలు అందించే బిడ్డర్లకు 5జీ స్పెక్ట్రంను టెలికాం శాఖ కేటాయిస్తుంది. ప్రస్తుత 4జీ సేవలతో పోలిస్తే 5జీ సేవలు పది రెట్లు వేగం, సామర్థ్యం కలిగిఉంటాయని క్యాబినెట్ పేర్కొంది. 20 ఏండ్ల వ్యాలిడిటీతో మొత్తం 72097.85 ఎంహెచ్‌జడ్ స్పెక్ట్రమ్‌ను జులై మాసాంతానికి వేలం ప్రక్రియ ముందుంచుతారు. భారత్ 5జీ ఎకోసిస్టంలో భాగంగా స్పెక్ట్రం వేలాన్ని ప్రకటిస్తున్నామని కేంద్ర టెలికాం, ఐటీ కమ్యూనికేషన్ల మంత్రి అశ్వని వైష్ణవ్ పేర్కొన్నారు. 2021 సెప్టెంబర్‌లో ప్రకటించిన టెలికాం రంగ సంస్కరణల ప్రకారం వేలంలో స్పెక్ట్రం దక్కించుకున్న ప్రొవైడర్లు ఎలాంటి స్పెక్ట్రం యూసేజ్ చార్జీలు విధించరు. టెలికాం నెట్‌వర్క్‌ల నిర్వహణ వ్యయానికి సంబంధించి ఇది సర్వీస్ ప్రొవైడర్లకు ఊరటగా భావిస్తున్నారు. వేలంలో విజయవంతమైన బిడ్డర్ల నుంచి తొలిసారిగా అప్‌ఫ్రంట్ పేమెంట్ వసూలు చేయడం లేదని క్యాబినెట్ స్పష్టం చేసింది. ప్రతి ఏడాది ఆరంభంలో స్పెక్ట్రం చెల్లింపులను ముందస్తుగా 20 సమాన వాయిదాల్లో చెల్లించాలని ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది. పదేండ్ల తర్వాత ఎలాంటి బకాయిలు లేకుండా స్పెక్ట్రంను తిరిగి స్వాధీనం చేసే వెసులుబాటు బిడ్డర్లకు కల్పిస్తారని పేర్కొంది.

# 20 తేది బద్వేలులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతు పోరు బాట

బద్వేలు , బద్వేలులో ఈనెల 20వ తేదీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతు పోరుబాట అనే కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు అందులో భాగంగా అవసరమైన ప్రదేశాన్ని తెలుగుదేశం నాయకులు పరిశీలించారు కడప దేశం పార్టీ పార్లమెంట్ కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె విజయమ్మ పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి పార్టీ రాష్ట్ర కన్వీనర్ వెంకట సుబ్బారెడ్డి వికాస్ హరికృష్ణ బద్వేలు మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు గుర్రం పాటి వేంగలరెడ్డి గ్రామీణ పార్టీ అధ్యక్షుడు టీవీఎస్ రవి పాల్గొన్నారు



# ప్రభుత్వ కళాశాలల 149 మంది పేద విద్యార్థినులకు స్కాలర్షిప్స్ అందజేత

## పాల్గొన్న విద్యాశాఖ అధికారులు

నెల్లూరు, (జూన్ 15 బుధవారం). సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన 149 మంది విద్యార్థినులకు స్థానిక విద్యాశాఖ అధికారులు చేతులమీదుగా ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక మినీ బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నెల్లూరు శాఖలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారులు డాక్టర్ ఏ .శ్రీనివాసులు, ఆర్ఐఓ టి. వర ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సామాజిక సేవలు అభినందనీయం అన్నారు. మలబార్ గ్రూపు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ( సి ఎస్ ఆర్) లో భాగంగా పేద విద్యార్థినులకు స్కాలర్షిప్లను చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ కళాశాలలో




ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న గుర్తించబడిన 149 పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి 8వేల నుండి 10వేల వరకు ఉపకార వేతనాలు 13 లక్షల 40 వేల నగదును చెక్కు రూపంలో అందజేయడం సంతోషకర విషయం అన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని గ్రహించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం రానున్న విద్యా సంవత్సరం లోనూ 5500 మంది పేద విద్యార్థి ఉపకారవేతనాలు అమలు చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించడం సంతోషకర విషయం అన్నారు. మలబార్ గ్రూప్ యొక్క నిబద్ధతలో భాగంగా సామాజిక సేవ కార్యక్రమాలకు, వివిధ దాతృత్వ కార్యకలాపాలకు మలబార్ గోల్డ్ డైమండ్స్ లాభాలలో నెల్లూరు జిల్లా శాఖ పరిధిలో 5 శాతం ఖర్చు పెట్టేందుకు ముందుకు రావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మార్కెటింగ్ మేనేజర్ గోకుల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థినులకు ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో 2007 నుండి 2022 వరకు సుమారు 19, 362 మంది విద్యార్థినులకు దాదాపు 2 కోట్లకు పైగా ఉపకార వేతనాలు అందజేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా పేదల గృహ నిర్మాణం కోసం 2004లో మలబార్ హౌసింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయబడిందని, తద్వారా ఇప్పటి వరకు 15 వేల పైచిలుకు పేద కుటుంబాలకు 47 వేల కోట్ల నిధులతో గృహ నిర్మాణ మెటీరియల్స్ అందజేయడం జరిగిందని చెప్పారు. అంతేకాకుండా వైద్యసహాయం పర్యావరణ పరిరక్షణ మహిళా సాధికారత మరియు విద్యా రంగాలలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం దృష్టి సారించిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు మరియు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ హెడ్ సాహిల్, మరియు మల్బార్ గ్రూపు మేనేజ్మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 9 మండలాలకు పరిమితమైన బద్వేల్ రెవెన్యూ డివిజన్



బద్వేలు , బద్వేలు రెవెన్యూ డివిజన్ ఇప్పుడు కేవలం 9 మండలాలకు పరిమితమైంది మొన్నటి వరకు 12 మండలాలతో బద్వేలు రెవెన్యూ డివిజన్ ఉండేది ఈ ఏడాది ఏప్రిల్ మూడవ తేదీ బద్వేలు రెవెన్యూ డివిజన్ ను అధికారికంగా ప్రారంభించారు అప్పట్లో బద్వేల్ నియోజకవర్గంలోని 7 మండలాలు మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు బద్వేల్ రెవెన్యూ డివిజన్లో ఉండేవి ప్రభుత్వం మంగళవారం జారీచేసిన తాజా ఉత్తర్వుల్లో మైదుకూరు నియోజకవర్గం లోని కాజీపేట మండలం కడప రెవెన్యూ డివిజన్ లో కి దువ్వూరు చాపాడు మండలాలు జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ లో కి మార్పులు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది దీంతో బద్వేలు రెవెన్యూ డివిజన్ తొమ్మిది మండలాలకు పరిమితమైంది

# అనిరుధ్ కొట్టుడు మామూలుగా లేదు



ఇటీవల కాలంలో ఒక సినిమా కు మంచి హైప్ క్రియేట్ అవ్వాలి అంటే ముందుగా సినిమాలోని పాటలు జనాల్లోకి చాలా ఈజీగా వెళ్లిపోవాల్సి ఉంటుంది. లేకపోతే ఏ సినిమాకు కూడా అనుకున్నంత స్థాయిలో అయితే ఓపెనింగ్స్ రావడం లేదు. ఇక ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో అయితే మ్యూజిక్ తోనే జనాలు ఎక్కువగా థియేటర్లోకి రప్పించే సంగీత దర్శకులలో అనిరుద్ రవిచంద్రన్ టాప్ లిస్టు లో ఉన్నాడు అని చెప్పవచ్చు. ఎలాంటి మ్యూజిక్ ఇచ్చినా కూడా అన్ని వర్గాల వారికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. ఎలాంటి పాత్రనైనా సరే తనదైన శైలిలో కంపోజ్ చేసే అనిరుద్ ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీ లోనే కాకుండా దేశ వ్యాప్తంగా అత్యధిక పారితోషికం అందుకుంటున్న సంగీత దర్శకుల్లో ఒకరిగా నిలుస్తున్నాడు అనే చెప్పాలి. ఒక విధంగా అనిరుద్ కి ఎవరు కూడా సరైన పోటీని కూడా ఇవ్వడం లేదు. అతని దూకుడుకి ఇంత మొన్నటివరకు ఫామ్లో ఉన్న అగ్ర సంగీత దర్శకులు కూడా వెనుకబడి పోతున్నారు అనే చెప్పాలి. యువన్ శంకర్ రాజా సంతోష్ నారాయణన్ తమిళం ఇండస్ట్రీలో బాగానే రానిస్తున్నప్పటికి కూడా అనిరుధ్ మాత్రం వారి కంటే ఎక్కువ స్థాయిలో అవకాశాలు అందుకుంటున్నాడు. ఇక తెలుగులో దేవిశ్రీప్రసాద్ థమన్ కూడా అతని తర్వాతే అని చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు అతను టాలీవుడ్ పై కూడా స్పెషల్ ఫోకస్ చేశాడు. ఎన్టీఆర్ కొరటాల కలయికలో రాబోయే బిగ్గెస్ట్ పాన్ ఇండియా సినిమా కోసం అనిరుద్ సెలెక్ట్ అయిన విషయం తెలిసిందే. రీసెంట్గా విక్రమ్ సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న అనిరుద్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో కూడా సినిమాకు మంచి హైప్ క్రియేట్ చేశాడు. ఇక ప్రస్తుతం అతని చేతిలో అయితే చాలా పెద్ద సినిమాలే ఉన్నాయి. బాలీవుడ్లో కూడా మొదటిసారి షారుక్ ఖాన్ జావాన్ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు. అలాగే రజనీకాంత్ అజిత్ ఇలా మరికొంతమంది అగ్ర హీరోలకు కూడా సంగీతం అందించబోతున్నారు. ఇక అనిరుద్ రాబోయే రోజుల్లో మరో స్థాయికి వెళతాడు అనే చెప్పాలి.

# ఇక ఆగేదిలేదంటున్న యంగ్ హీరో!

మొదటి నుంచి కూడా నిఖిల్ డిఫరెంట్ కంటెంట్ వైపు వెళుతున్నాడు. కొత్తదనం ఉన్న కథలను .. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ వస్తున్నాడు. తన సినిమాల బడ్జెట్ పెరగకుండా చూసుకుంటూ .. తన మార్కెట్ తగ్గకుండా జాగ్రత్తపడుతూ వస్తున్నాడు. నిఖిల్ తన కెరియర్ ను మొదలు పెట్టిన దగ్గర నుంచి ఆడియన్స్ తో గ్యాప్ రాకుండా చూసుకున్నాడు. కానీ ఈ సారి అనుకోకుండానే గ్యాప్ పెరిగిపోయింది. అందుకు ఒక కారణం కరోనా అయితే మరో కారణం ఈ సారి ఆయన ప్లానింగు దెబ్బతినడమేననేవారు లేకపోలేదు. 'అర్జున్ సురవరం' తరువాత నిఖిల్ నుంచి సినిమా రావడంలో ఆలస్యం జరిగిన మాట నిజమే. అయితే అక్కడ వచ్చిన ఆ గ్యాప్ ను ఈ ఏడాదిలో ఫిలప్ చేయడానికి అన్నట్టుగా ఆయన వరుస ప్రాజెక్టులను లైన్లో పెట్టేశాడు. ఆయన తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'కార్తికేయ 2' రెడీ అవుతోంది. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను జూలై 22వ తేదీన విడుదల చేయనున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా అలరించనున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇక ఆ తరువాత గీతా ఆర్ట్స్ 2లో చేసిన '18 పేజెస్' సినిమా సెప్టెంబర్ లో విడుదల చేయనున్నారు. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వం వహించి న ఈ సినిమాలోను కథానాయిక అనుపమనే కావడం విశేషం. ఈ రెండు సినిమాలు ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఆ తరువాత ఏడాది ప్రథమార్ధంలోనే ఆయన రెండు సినిమాలను దింపడానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. ఒకటి గ్యారీ బీహెచ్ దర్శకత్వంలోని 'స్పై' సినిమా .. రెండోది సుధీర్ వర్మ దర్శకత్వంలోని మరో సినిమా. దీనికి ఇంకా టైటిల్ ను ఖరారు చేయలేదు. ఇలా నిఖిల్ నాలుగు ప్రాజెక్టులను లైన్లో పెట్టేసుకుని కూర్చున్నాడు. ఒకదాని తరువాత ఒకటిగా ఇవి థియేటర్లలో దిగిపోనున్నాయి. ఈ నాలుగు సినిమాల తరువాత నిఖిల్ మళ్లీ చందూ మొండేటి దర్శకత్వంలో మరో సినిమాను చేయనున్నట్టుగా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన స్క్రిప్ట్ పై కసరత్తు నడుస్తోందట. ఇది ఈ ఇద్దరి కాంబినేషన్లో వస్తున్న మూడో సినిమా కావడం విశేషం.



# మళ్లీ రెబల్ స్టార్ 'ఒక్క అడుగు' కదలికలు!

ప్రభాస్ కథానాయకుడిగా రెబల్ స్టార్ కృష్ణంరాజు 'ఒక్క అడుగు 'చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తన గోపీకృష్ణ మూవీస్ పై సోలోగా నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోన్న సంగత తెలిసిందే. 'బాహుబలి' సినిమా ప్రారంభం ముందు నుంచి ఒక్క అడుగు ప్రాజెక్ట్ వినిపిస్తోంది. కానీ ఇప్పటివరకూ ఈ చిత్రం పట్టాలెక్కింది లేదు. ప్రభాస్ వేరే వేరు సినిమాలకు కాల్షీట్లు కేటాయిస్తున్నారు తప్ప! 'ఒక్క అడుగు'కి మాత్రం కేటాయించలేదని తర్వాత పరిణామాలే చెప్పాయి. నాలుగేళ్ల క్రితం కృష్ణంరాజు బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించి పెద్దాయన డీటైల్స్ వెల్లడించారు. ప్రభాస్ కటౌట్ కు అదిరిపోయే స్క్రిప్ట్ అని...చక్కని సందేశంతో కూడుకున్న సినిమా అవుతుందని...ఒక్క అడుగు వేయి అడుగుల పడేలా ఇన్స్పైర్ చేసే స్క్రిప్ట్ అని చెప్పారు. కృష్ణం రాజు స్వయంగా ఈ కథను సిద్ధం చేసుకున్నట్లు కూడా వెల్లడించారు. ఆ సందర్భంలో మీరే డైరెక్ట్ చేయొచ్చు కదాని ప్రశ్నించగా? అది నేను చేయాల్సిన సినిమా కాదు...పూరి జగన్నాథ్ లాంటి వాళ్లు చేయాల్సిన పవర్ ఫుల్ స్క్రిప్ట్ అని పరోక్షంగా పూరి పేరు రివీల్ చేసారు. మంచి డైరెక్టర్ ప్రభాస్ వెసులుబాటు దొరకగానే సెట్స్ కు వెళ్తుందని పెద్దయన చెప్పారు. కానీ ఇప్పటివరకూ ఆ ప్రాజెక్ట్ కార్య రూపం దాల్చలేదు. 'బాహుబలి' తర్వాత ప్రభాస్ 'సాహో' చేసారు. ఆతర్వాత నటించిన 'రాధేశ్యామ్' కూడా ఇటీవలే రిలీజ్ అయింది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' అనే భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు. ఇది పాన్ ఇండియా కేటగిరి సినిమా. మరి ఇలాంటి సందర్భంలో 'ఒక్క అడుగు' పడటానికి ఆస్కారం ఉందా? మళ్లీ టాలీవుడ్ లో ఒక్క అడుగు కదలికలు మొదలయ్యాయా? అంటే అవుననే టాక్ ఫిలిం సర్కిల్స్ లో జోరుగా వినిపిస్తుంది. ఇటీవలే 'ఒక్క అడుగు' చిత్రం గురించి మరోసారి కృష్ణంరాజు అబ్బాయ్ వద్ద చర్చించారుట. అందుకు ప్రభాస్ తప్పకుండా చేద్దామని మరోసారి ప్రామిస్ చేసినట్లు గుస గుస వినిపిస్తుంది. దర్శకుడు పేరు కూడా తెరపైకి వస్తోంది. ముందు వరుసలో పూరి పేరు ఉండగా..అటుపై మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ పేరు సెకెండ్ ఆప్షన్ గా కనిపిస్తుందని సమాచారం. అయితే ఇక్కడ డార్లింగ్ ఫైనల్ డెసిషన్ తీసుకోవడమే అంతిమంగా బ్యాలెన్స్ అని చెప్పాలి. పూరి-డార్లింగ్ ర్యాపో గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రభాస్ ఫేమస్ డైరెక్టర్ పూరి. అతని మేకింగ్ అంటే ప్రభాస్ కి ఎంతో ఇష్టం. అంతకు మించి అంతని లో గొప్ప రైటర్ ని ఎంతో ఇష్టపడతారు. హీరో పాత్రని పూరి డిజైన్ చేసినట్లు గా ఇంకే మేకర్ రాయలేదని బలంగా చెప్పే హీరోల్లో డార్లింగ్ ముందుంటారు. ఇటీవలే మరోసారి పూరి పై తనకున్న అభిమానాన్నిసైతం చాటుకున్నారు. పూరి తో సినిమా చేసి చాలా కాలమవుతోందని...తనతో మంచి ఎంటర్ టైనింగ్ సినిమా చేసి రీఫ్రెష్ అవ్వాలని ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ అన్నారు. ఆ ప్రాజెక్ట్ 'ఒక్క అడుగు' ఎందుకు అవ్వకూడదు. అయితే ఇక్కడ చిన్న మతలబు ఉంది. పూరి ఇతర రైటర్ల కథల్ని తీసుకున్న సందర్భం లేదు. రీమేక్ లు కూడా చాలా అరుదు. అయితే ఇక్కడ కథ రాసింది రెబల్ స్టార్ కాబట్టి పూరి టేకప్ చేసే ఛాన్స్ కనిపిస్తుంది.



# గ్రూప్ టాపర్‌గా భారత్.. సునీల్ ఛెత్రీ ఖాతాలో అరుదైన రికార్డు



ఫుట్‌బాల్ స్టార్.. భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రీ అరుదైన ఘనత సాధించాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో సునీల్ ఛెత్రీ ఆట 45వ నిమిషంలో గోల్‌తో మెరిశాడు. ఈ గోల్ సునీల్ ఛెత్రీకి 84వ అంతర్జాతీయ గోల్ కావడం విశేషం. ఈ నేపథ్యంలోనే హంగేరీ ఫుట్‌బాల్ దిగ్గజం ఫెరెన్క్ పుస్కాస్‌తో సమానంగా టాప్-5లో నిలిచాడు. పుస్కాస్ కూడా హంగేరీ తరపున 84 అంతర్జాతీయ గోల్స్ కొట్టాడు. ఇక టాప్ ఫోర్‌లో పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో(117 గోల్స్), ఇరాన్ స్టార్ అలీ దాయి (109 గోల్స్) రెండో స్థానంలో.. మొఖ్తర్ దహరి (89 గోల్స్) మూడో స్థానంలో.. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ 86 గోల్స్‌తో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక మెస్సీకి, సునీల్ ఛెత్రీకి మధ్య గోల్స్ వ్యత్యాసం రెండు మాత్రమే ఉండడం విశేషం. అంతర్జాతీయంగా ఎక్కువ గోల్స్ కొట్టిన టాప్-10 జాబితాలో రొనాల్డో, మెస్సీ, సునీల్ ఛెత్రీ, అలీ మొబ్‌కూత్(80 గోల్స్, యూఏఈ) మాత్రమే ప్రస్తుతం ఆడుతున్నారు. ఇక ఆసియా కప్ గ్రూప్-డి క్వాలిఫయర్స్‌లో భాగంగా హంగ్‌కాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4-0 తేడాతో ఘన విజయం అందుకుంది టీమిండియా. ఈ విజయంతో టేబుల్ టాపర్‌గా ఆసియా కప్ 2023 టోర్నీలో ఆడనుంది. ఈ మ్యాచ్‌కి ముందు టేబుల్ టాపర్‌గా ఉన్న హాంకాంగ్‌పై ఆది నుంచి భారత్ ఎదురుదాడికి దిగింది. ఆట రెండో నిమిషంలోనే గోల్ సాధించి, హంగ్ కాంగ్‌ని ఒత్తిడిలోకి నెట్టేసింది. ఆట ప్రారంభమైన రెండో నిమిషంలో అన్వర్ ఆలీ గోల్ సాధించి, భారత జట్టుకి 1-0 ఆధిక్యం అందించాడు. తొలి సగం ముగుస్తుందనగా ఆట 45వ నిమిషంలో భారత కెప్టెన్ సునీల్ ఛెత్రీ గోల్ చేసి టీమిండియాను 2-0 ఆధిక్యంలో నిలిపాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**